andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 36.7 • కనిష్ఠం 22.6



నిర్మల్ జిల్లా వార్తలు

6

మంగళవారం 12 మార్చి 2024



వద్దే వద్దు!

- ఐకే రెడ్డిని కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దంటూ సీనియర్ నేతల ఆందోళన
- మండలాల వారీగా నిరసన సమావేశాలు
- సీఎం రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేసేందుకు రాజధానికి తరలిన సీనియర్ నాయకులు
- నగేష్‌కు టికెట్ ఇవ్వద్దంటూ బీజేపీలో రగడ
- ఆయన్ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న పార్టీ నేతలు

నిర్మల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్, బీజేపీలలో కొత్త నేతల చేరికల వ్యవహారం రగడకు ఆజ్యం పోస్తోంది. ముఖ్యంగా నిర్మల్ జిల్లాకు చెందిన మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నట్లు జరుగుతున్న ప్రచారం గత కొద్ది రోజుల నుంచి అటు బీఆర్ఎస్‌లోనూ అటు కాంగ్రెస్ పార్టీలోనూ దుమారం రేపుతోంది. అయితే రోజురోజుకూ ఇంద్రకరణ్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్న వ్యవహారం రాజకీయంగా ప్రాధాన్యతను సంతరించుకుంటున్న కారణంగా ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అప్రమత్తమయ్యాయి. గత రెండు రోజుల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయ కులంతా మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డిని పార్టీలోకి చేర్చుకోవద్దంటూ చేస్తున్న డిమాండ్ తీవ్రరూపం దాల్చుతోంది. ఆదివారం సారంగాపూర్ మండలానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులంతా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని పార్టీలోకి చేర్చుకోవద్దంటూ తీర్మానాలు చేయడమే కాకుండా ఆయన చేరికను అడ్డుకుంటామంటూ సైతం అల్టిమేటం జారీ చేశారు. దీనికి అనుగుణంగానే సోమవారం నిర్మల్, మామడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అలాగే సోన్, దిలావర్‌పూర్, లక్ష్మణచాంద, నిర్మల్ మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులంతా సమావేశమై ఇంద్రకరణ్‌రెడ్డిని పార్టీలోకి చేర్చుకోవద్దంటూ తీర్మానాలు చేశారు. ఈ తీర్మానాలను పార్టీ అధిష్ఠానానికి పంపుతున్నట్లు వారంతా వెల్లడించారు. ఇంద్రకరణ్‌రెడ్డిపై పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలున్నాయని, అయన భూకబ్జాలకు పాల్పడ్డాడంటూ వారంతా ఆరోపిస్తున్నారు. ఇలాంటి ఆరోపణలు ఉన్న నేతను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుంటే పార్టీకి నష్టం జరుగుతుందని అలాగే పార్టీపై ప్రజల్లో ఉన్న నమ్మకం సన్నగిల్లుతుందంటూ వారు స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికే కొంతమంది సీనియర్ నాయకులు మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డిని పార్టీలోకి చేర్చుకోవద్దన్న డిమాండ్‌తో సీఎంతో పాటు సీనియర్ నేతలను కలిసేందుకు హైదరాబాద్ వెళ్లారు. అలాగే అన్ని మండలాల వారిగా ఇంద్రకరణ్ రెడ్డికి వ్యతిరేకంగా ఆందోళనలు చేపట్టేందుకు సీనియర్‌లు సిద్ధమవుతున్నారు. డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావుపై కూడా వీరంతా ఒత్తిడి తీసుకువస్తున్నారు. అయితే ఇంద్రకరణ్ రెడ్డి మాత్రం ఇప్పటికే తన అనుచరులు, కార్యకర్తలతో పలు దఫాలుగా సమావేశమై పార్టీ మార్పు విషయంలో ఓ నిర్ణయం తీసుకునేందుకు సిద్ధమవుతున్నారంటున్నారు. ఇంద్రకరణ్ రెడ్డి పార్టీ మారడం ఖాయమన్న సంకేతాలు స్పష్టమవ్వడంతో.. ఇక ఆయన్ను వ్యతిరేకిస్తున్న ఆ పార్టీ సీనియర్ నేతలంతా తమ కార్యాచరణను పకడ్బందీగా అమలు చేయాలని తలపెడుతున్నారు. అలాగే రెండు రోజుల క్రితం బీజేపీలో చేరిన బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎంపీ నగేష్‌కు ఎంపీ టికెట్ ఇవ్వవద్దంటూ ఇక్కడి కాషాయ నేతలు డిమాండ్ మొదలుపెట్టారు. ఈ మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షులు అంజుకుమార్ రెడ్డి, పార్టీ లోక్‌సభ ఇన్‌చార్జీ అయ్యన్న గారి భూమయ్యలతో పాటు తదితరులంతా ఢిల్లీ వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. పరోక్షంగా ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి సైతం నగేష్‌కు టికెట్ ఇచ్చే వ్యవహారాన్ని వ్యతిరేకిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. పార్టీలో కొత్తగా చేరిన వారికి టికెట్‌లు కేటాయిస్తే దీర్ఘకాలం నుంచి పార్టీ కోసం త్యాగాలు చేస్తున్న సంగతి ఏంటంటూ వారు ప్రశ్నిస్తున్నారు. మొదటి నుంచి సిద్ధాంతాలకు కట్టుబడి ఉండే పార్టీగా పేరున్న బీజేపీలో ప్రస్తుతం కొత్త తరహా పోకడలు వస్తుండడం పట్ల వారంతా విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి కాంగ్రెస్, బీజేపీ పార్టీల్లో చేరికలు, టికెట్‌ల వ్యవహారం ప్రస్తుతం రాజకీయ జగడాలకు వేదిక కాబోతోందని అంటున్నారు.

ఐకే రెడ్డిపై కాంగ్రెస్ శ్రేణుల తిరుగుబాటు

బీఆర్ఎస్ పార్టీలో పదేళ్ల పాటు పదవులు అనుభవించి అవినీతి ఆరోపణలు కూడగట్టుకున్న మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అనూహ్యంగా కాంగ్రెస్ పార్టీలో చేరుతుండడాన్ని ఆ పార్టీకి చెందిన కొంతమంది సీనియర్ నేతలు వ్యతిరేకిస్తుండడం చర్చనీయాంశమవుతోంది. కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీ తరపున తామంతా వ్యయ ప్రయాసాల కోర్చి కొట్లాడామని.. తీరా బీఆర్ఎస్ పార్టీ ఓటమి చెందడం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఇంద్రకరణ్‌రెడ్డి ఇటువైపు దృష్టి సారించడాన్ని వారంతా జీర్ణించుకోలేకపోతున్నారు. ఇంద్రకరణ్ రెడ్డిపై కుప్పలు తెప్పలుగా అవినీతి ఆరోపణలు ఉన్నాయని, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ పటిష్టంగా మారుతున్న సమయంలో ఐకే రెడ్డిని చేర్చుకొని అప్రతిష్టను మూటగట్టుకోవడం సమంజసం కాదంటూ సీనియర్లు పేర్కొంటున్నారు. దీనికి తోడుగా అన్ని మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐకెరెడ్డికి వ్యతిరేకంగా జతకడుతూ అయనను పార్టీలోకి తీసుకోవద్దంటూ ఆందోళనలు మొదలుపెట్టారు. భూకబ్జాలు, అవినీతి అక్రమాల ఆరోపణలున్న మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకుంటే ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళతాయని వారంతా అభిప్రాయపడుతున్నారు. అయితే ఇంద్రకరణ్ రెడ్డి వర్గీయులు మాత్రం తమ ప్రయత్నాలు కొనసాగుతున్నాయని, అధిష్ఠానం కూడా ఇందుకోసం గ్రీన్ సిగ్నల్ జారీ చేసిందంటూ స్పష్టం చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఐకే రెడ్డి గత రెండు రోజుల నుంచి పార్టీ నాయకులు, అనుచరులతో మంతనాలు సాగిస్తుండడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది.

నగేష్‌కు టికెట్ ఇవ్వొద్దు..

రెండు రోజుల క్రితం బీజేపీలో చేరిన బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎంపీ గెడం నగేష్‌కు ఎంపీ టికెట్ ఇవ్వొద్దన్న డిమాండ్ క్రమంగా తీవ్రమవుతోంది. పార్టీలో చాలా మంది సీనియర్ నాయకులు ఏళ్ల నుంచి పని చేస్తూ అనేక త్యాగాలు చేశారని.. అలాంటి వారిని పక్కన పెట్టి నగేష్‌ను పార్టీలో చేర్చుకోవడమే కాకుండా ఆయనకు లోక్‌సభ టికెట్ ఇచ్చేందుకు అధిష్ఠానం సిద్ధమవుతుండడాన్ని ఇక్కడి నేతలు గట్టిగా వ్యతిరేకిస్తున్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్ రెడ్డి, లోక్‌సభ ఇంచార్జీ అయ్యన్నగారి భూమయ్యతో పాటు మరికొంతమంది జిల్లా సీనియర్ నాయకులు నగేష్‌కు ఎంపీ టికెట్ ఇవ్వవద్దంటూ బహిరంగంగానే పేర్కొంటున్నారు. అలాగే బీజేపీ శాసనసభ పక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి సైతం నగేష్‌కు టికెట్ ఇచ్చే విషయంలో వ్యతిరేఖత కనబరుస్తున్నట్లు చెబుతున్నారు. మొత్తానికి ఇటు కాంగ్రెస్‌లో ఐకే రెడ్డి చేరబోతున్న వ్యవహారం, అటు బీజేపీలో నగేష్‌కు టికెట్ ఇవ్వబోతున్న వ్యవహారం ప్రస్తుతం జిల్లాలో రాజకీయ ప్రకంపనలకు కారణమవుతోంది.



మాజీ మంత్రి ఐకే రెడ్డిని కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దంటూ మీడియాతో మాట్లాడుతున్న పార్టీ నేతలు



జిల్లా వైద్యాధికారితో మాట్లాడుతున్న ఆశా వర్కర్లు

ఆశా వర్కర్ల పెండింగ్ బిల్లులు చెల్లించండి

వైద్యాధికారికి ఆశా కార్యకర్తల వినతి

నిర్మల్ కల్చరల్, మార్చి 11 : ఆశా వర్కర్లకు పెండింగ్‌లో ఉన్న లెప్రసీ సర్వే డబ్బులు చెల్లించాలని ఆశా వర్కర్ల సంఘం సోమవారం జిల్లా వైద్యాధికారికి విన్నవించింది. గతంలో వర్కర్లను తీసుకొని సర్వే చేశామని, ఆ డబ్బులు చెల్లించకపోగా మళ్లీ సర్వే చేయాలని ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. ఆశాలపై పని భారాన్ని మోపుతూ ఆందోళనకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కంటి వెలుగు, ఎన్నికల డ్యూటీ డబ్బులు ప్రభుత్వం నుంచి వచ్చినా ఇప్పటి వరకు చెల్లించకపోవడం విచారకరమన్నారు. తమకు రావలసిన న్యాయమైన రెమ్యూనరేషన్ చెల్లించాలని, లేనట్లయితే పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు పి. గంగామణి, కార్యదర్శి చంద్రకళ, భాగ్యలక్ష్మి, రామలక్ష్మి, శ్యామల, శ్రీలత, గంగలక్ష్మి, రాజమణి, సుజాత, తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల బాండ్లకు వ్యతిరేకంగా సీపీఎం నాయకుల నిరసన

బాండ్ల వివరాలను బహిర్గతం చేయాలి

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు నూతన్

నిర్మల్ కల్చరల్, మార్చి 11 : సుప్రీంకోర్టు ఆదేశం మేరకు ఎస్‌బీఐ చైర్మన్ ఎన్నికల బాండ్ల వివరాలను బహిర్గతం చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు డి. నూతన్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఎస్‌బీఐ నిర్మల్ బ్యాంకు ఎదుట కేంద్ర పార్టీ పిలుపు మేరకు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వత్తాసు పలుకుతున్న ఎస్‌బీఐ చైర్మన్‌ను అరెస్టు చేయాలన్నారు. ఎన్నికల వ్యవస్థ రాజ్యాంగాన్ని తప్పుదోవ పట్టిసున్నారన్నారు. ఈ నిరసనలో నాయకులు బి. సురేష్, తిరుపతి, ఫసియుద్దీన్, గంగాధర్, సాయికిరణ్, నవీన్, అబ్బాస్, తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నానికి పాల్పడ్డ భర్తకు ఐదేళ్ల జైలు శిక్ష

నిర్మల్ కల్చరల్, మార్చి 11 : జిల్లాకేంద్రంలోని నాయుడువాడకు చెందిన రామ్ సురేష్ తన భార్యపై హత్యాయత్నం చేశాడన్న నేరంపై సోమవారం అతనికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రెండు వేల రూపాయల జరిమానా విధిస్తూ అసిస్టెంట్ సెషన్స్ న్యాయాధికారి కే. అజేష్ కుమార్ తీర్పునిచ్చారని కోర్టు సయన్వయ అధికారి, ఎస్సై సక్రియా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. 20ఏళ్ల క్రితం పెళ్లైన సురేష్‌కు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. అతను మద్యానికి బానిసై భార్యను వేధించేవాడు. భార్యకు మహాలక్ష్మీ వాడలో ఇందిరమ్మ పథకం కింద ఇంటిస్థలం ఉండడంతో.. దానిని అమ్మి డబ్బుల కోసం హింసించేవాడు. 2022 ఫిబ్రవరి 8న నిందితుడు ఆమె ఉంటున్న నివాసానికి రాత్రిపూట వచ్చి గొంతు నులిమి, తలను గోడకు వేసి బాదగా బలమైన గాయమై రక్తస్రావమైంది. సరిగ్గా ఇదే సమయంలో బాధితురాలి అక్క రావడాన్ని చూసి నిందితుడు పారిపోగా.. ఆమెను వెంటనే చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. ఎస్సై యాసిర్ అరాఫత్ కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై. రమణారావు ఈ కేసులో 14 మందిని విచారించగా నేరం రుజువైందని కోర్టు సయన్వయ అధికారి, ఎస్సై సక్రియా నాయక్ పేర్కొన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బీజేపీ శ్రేణులు

బీజేపీ గెలుపులో ప్రధాన భూమిక పోషించాలి

ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్

భైంసా, మార్చి 11 : పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపులో ప్రధాన భూమిక పోషించాలని ముథోల్ బీజేపీ శ్రేణులకు ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్ పిలుపునిచ్చారు. సోమవారం భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో పార్టీ అధ్వర్యంలో నిర్వహించిన అసెంబ్లీ స్థాయి వర్క్‌షాప్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పార్టీ ప్రతినిధులు, పదాధికారులు, ప్రధాన శ్రేణులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను విస్తృత స్థాయిలో ప్రచారం చేయాలన్నారు. తద్వారా పార్టీ అభ్యర్థి గెలుపు కోసం మార్గం సుగమం చేయాలన్నారు. ఇదే క్రమంలో తీస్రీ బార్.. మోదీ సర్కార్ కోసం కంకణబద్ధుల వ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వ లబ్దిదారులను కలిసి ఎన్నికల్లో వారి మద్దతు కూడగట్టుకునే దిశగా అడుగులు వేయాలన్నారు. లాభార్థి సంపర్క్ అభియాన్ పార్లమెంట్ కన్వీనర్ గాలి రవి మాట్లాడుతూ.. బీజేపీ కార్యకర్తలంతా పార్లమెంట్ ఎన్నికల కోసం పూర్తి స్థాయిలో సన్నద్ధమవ్వాలన్నారు. ఆ తర్వాత ఆ తర్వాత లాభార్థి సంపర్క్ అభియాన్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సమావేశంలో నియోజకవర్గ పరిధిలోని పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



విజేతలకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న దృశ్యం

బోరిగాంలో వాలీబాల్ టోర్నమెంట్

తానూర్ , మార్చి 11 : ఎన్‌వైకేఎస్ ఆధ్వర్యంలో మండలంలోని బోరిగాం గ్రామంలో సోమవారం బ్లాక్‌లెవెల్ వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌వైకేఎస్ కోఆర్డినేటర్ బంక కిరణ్ మాట్లాడుతూ.. తానూర్, బాసర మండల యువకులు వాలీబాల్ టోర్నమెంట్‌లో పోటీ పడగా.. అందులో బోరిగాం గ్రామానికి చెందిన రామ్‌సేన యూత్ జట్టు సభ్యులు విజేతలుగా నిలిచారని తెలిపారు. యువత చదువుతో పాటు క్రీడలపైనా దృష్టి సారించి మెళుకువలను తెలుసుకొని రాణించాలన్నారు. మొబైల్‌గేమ్స్‌కి అలవాటు పడొద్దన్నారు. గ్రౌండ్‌లోకి వచ్చి ఆటలాడితే శరీరార సామర్థ్యంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు పాల్గొన్నారు.

రంజాన్ పండుగకు ఏర్పాట్లు చేయండి

- జిల్లాలో పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, పక్కన ఎస్పీ షర్మిల



ప్రజావాణిలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్ కల్చరల్, మార్చి 11 : ఈ నెలలో రంజాన్ పండుగ నిర్వహణకు తగిన ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఎస్పీ జానకి షర్మిలతో కలిసి సమావేశం నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో పండగ నిర్వహించుకోవాలని కలెక్టర్ కోరారు. అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే పుకార్లు నమ్మవద్దన్నారు. పుకార్లు వ్యాప్తి చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ... ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపడతామన్నారు. ప్రజల భాగస్వామ్యంతో ప్రశాంతంగా రంజాన్ పండగ నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. డీఆర్‌వో గంగయ్య, ఆర్డీవో రత్న కళ్యాణి, మున్సిపల్ కమిషనర్ రాజు, రెవెన్యూ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించండి : కలెక్టర్

నిర్మల్ కల్చరల్ : ప్రజావాణిలో సోమవారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ కలెక్టరేట్‌లో నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు కలెక్టర్‌కు అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణి, సీఎం ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించాలన్నారు. ఫిర్యాదులపై అలసత్వం వహించిన సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ స్పష్టం చేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు, బిలులు వెంటనే చెల్లించాలని విద్యాశాఖను ఆదేశించారు. కడెం మండలంలోని మైసంపేట్‌ను కొత్త మద్దిపడగ గ్రామ పంచాయతీలో కలపకుండా ప్రత్యేక పంచాయతీగా ఉంచాలని గ్రామస్తులు కలెక్టర్‌కు విన్నవించారు. ధరణి, కొత్త రేషన్ కార్డులు, రెవెన్యూ, పింఛన్లు తదితరులు వాటిపై దరఖాస్తు అందజేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్‌వో గంగయ్య, డీఆర్డీవో విజయలక్ష్మి, ఇతర శాఖల అధికారులు హాజరయ్యారు.

ఖానాపూర్‌లో ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఖానాపూర్, మార్చి 11 : ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఖానాపూర్ ఎస్సై లింబాద్రి సోమవారం తెలిపారు. సదరు అక్రమ ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ ఆదివారం రాత్రి ఖానాపూర్‌లో పట్టుబడినట్లు చెప్పారు. పెట్రోలింగ్‌లో ఉన్న పోలీసు సిబ్బంది అక్రమ ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకోగా.. డ్రైవర్ అక్కడి నుండి పారిపోయినట్లు ఎస్సై తెలిపారు. సదరు ట్రాక్టర్ ఖానాపూర్‌కు చెందిన తిరుపతికి చెందినదిగా గుర్తించామన్నారు. తగు చర్యల నిమిత్తం తహసీల్దార్ కార్యాలయానికి పంపించినట్లు తెలిపారు. అనుమతి లేకుండా అక్రమ ఇసుక రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు.

ఇంటర్ పరీక్షా కేంద్రం తనిఖీ

దిలావర్‌పూర్, మార్చి 11 : మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని డీఈసీ సభ్యులు జాదవ్ పరశురాం, వెంకటేశ్వర్లు, జాదవ్ రవికిరణ్‌లు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రథమ పరీక్షకు 209 హాజరు కాగా.. 14 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ కె. శంకర్, డిపార్ట్‌మెంట్ అధికారి లక్ష్మీకాంత్ తెలిపారు.

ఘనంగా అంబల్ల పండుగ

కుబీర్ మార్చి 11 : మండలంలోని పార్డి(బి) గ్రామంలో సోమవారం అంబళ్ల పండగను ఘనంగా నిర్వహించారు. ప్రతియేటా శివరాత్రి పండుగను పురస్కరించుకొని రాజరాజేశ్వర ఆలయంలో శివపార్వతుల కళ్యాణం మరుసటి రోజు అంబళ్ల పండుగను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



కాల్వ దేవాలయ హుండీ డబ్బును లెక్కిస్తున్న భక్తులు

కదిలి, కాల్వ ఆలయాల హుండీ లెక్కింపు

దిలావర్‌పూర్, మార్చి 11 : మండలంలోని కదిలి పాపహరేశ్వర దేవస్థానం, కాల్వ లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానం హుండీలను సోమవారం లెక్కించారు. కదిలి దేవాలయం హుండీ ద్వారా రూ. 4,19,924ల నగదు, ప్రత్యేక దర్శనం, అభిషేకం పూజ, అన్నదానం టికెట్ల ద్వారా రూ. 1,63,510లు మొత్తం రూ. 5,83,434ల ఆదాయం వచ్చింది.

కాల్వ లక్ష్మి నరసింహ స్వామి దేవాలయం..

కాల్వ లక్ష్మి నరసింహ స్వామి ఆలయ హుండీ ద్వారా రూ. 5,30,510 నగదు, 89 గ్రాముల మిశ్రమ బంగారం, 1 కిలో 420 గ్రాముల మిశ్రమ వెండి లభించింది. హుండీల లెక్కింపులో కదిలి, కాల్వ ఆలయాల చైర్మన్లు వెంకట్ రావు పాటిల్, మహేష్, ఆయా ఆలయాల ధర్మకర్తలు, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రవి కిషన్ గౌడ్, ప్రత్యేక అధికారి భూమ య్య, ఆయా ఆలయాల రికార్డ్ అసిస్టెంట్లు కేశవ్, మాధవ్ రావు, భక్తులు పాల్గొన్నారు.



దిలావర్‌పూర్‌లో మహిళా అధికారులకు ఘన సన్మానం

దిలావర్‌పూర్, మార్చి 11 : మండల కేంద్రంలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ శాఖల్లో వివిధ హోదాల్లో పని చేస్తున్న మహిళా అధికారులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

'అభివృద్ధికి అందరూ సహకరించాలి'

భీంపూర్, మార్చి 11: గ్రామాలలో అభివృద్ధి కోసం అందరూ రాజకీయాలకు అతీతంగా సహకరించాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం భీంపూర్ మండలం ధన్నోరా వద్ద కరంజి(టి) వరకు రూ.20 కోట్ల అంచనా వ్యయంతో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డబుల్ రోడ్డుగా మంజూరికి పంపి అది సాధించామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సరిహద్దు వరకు రోడ్డు పూర్తి అయ్యే దాక ఈ పనులు ఆగవని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. అలాగే కాంట్రాక్టర్ సమస్యతో గతంలో జాప్యం జరిగిందన్నారు. రూ.9 కోట్లతో తాంసి(కె) రోడ్డు, రూ.2.50 కోట్లతో అందర్‌బంద్ రోడ్డు నిర్మిస్తామన్నారు. ఇదిలా ఉంటే తనకు సమాచారం ఇవ్వలేదు అని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, డీఈఈ సురేష్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వారిని సముదాయించారు. ఆ తర్వాత తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీలో వారు పాల్గొన్నారు.


అలాగే, నేరడిగొండ, తలమడుగు మండలాల్లోనూ పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే అనిల్ అందజేశారు.

'అల్లోలను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవద్దు'

లక్ష్మణచాంద, మార్చి 11: మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవద్దని మండల కాంగ్రెస్ పార్టీలో తీర్మానించినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఓడ్నాల రాజేశ్వర్ సోమవారం అన్నారు. ఈ తీర్మానాన్ని నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు ద్వారా అధిష్టానానికి పంపనున్నట్లు పేర్కొన్నారు. మండలకేంద్రంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఓడ్నాల రాజేశ్వర్ మాట్లాడుతూ.. డి-1 పట్టాల పేరుతో భూ ఆక్రమణ, కాంట్రాక్టర్‌ల వద్ద కమీషన్లు తీసుకోవటం వంటి అవినీతి చర్యలకు పాల్పడినందునే ప్రజలు ఆయనను ఓడగొట్టినట్లు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అట్ల రామ్‌రెడ్డి, ఈటెల శ్రీనివాస్, భీమన్న, చింతకింది శేఖర్‌రెడ్డి, ముత్యం, తదితరులు ఉన్నారు.



లక్ష్మణచాందలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



ఆదివాసీ నేతలపై.. ప్రత్యేక దృష్టి!



- జిల్లాలో నేతల సామాజిక వర్గానికి పెరుగుతున్న ప్రాధాన్యత
- ఆదివాసీ నేతలపైనే ప్రధాన రాజకీయ పార్టీల దృష్టి
- లంబాడా నాయకత్వంపై ఆసక్తి చూపించని పార్టీలు
- కాంగ్రెస్‌లో కొత్తగా తెరపైకి వస్తున్న ఎమ్మెల్యే వెడ్మబొజ్జు

ఆదిలాబాద్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం ఎస్టీ రిజర్వ్‌డు కావడంతో ప్రధానంగా ఆదివాసీ, లంబాడా సామాజిక వర్గాల మధ్య ఆధిపత్యం కనిపిస్తోంది. ప్రస్తుత సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావు ఆదివాసీ సామాజికవర్గం కావడంతో మరోసారి అదే సామాజిక వర్గానికి చెందిన నేతలకు అవకాశం కల్పించేలా ప్రధాన పార్టీలు పావులు కదుపుతున్నాయి. అయితే అన్ని పార్టీలలో నాయకుల నాయకత్వం ఉన్నా.. అందరినోట నహీ అనే మాటనే వినిపిస్తోంది. ముఖ్యంగా పార్లమెంట్ ఎన్నికల్లో నేతల సామాజిక వర్గాన్ని బట్టి ప్రాధాన్యతనిస్తున్నట్లు కనిపిస్తోంది. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలలో ఇరువర్గాల నేతలు ఉన్నా.. అధిష్ఠానం పెద్దలు మాత్రం ఆదివాసీ నేతల వైపే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తుంది. గత పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ లు ఆదివాసీ నేతలను ఎన్నికల బరిలో దింపగా.. కాంగ్రెస్ లంబాడా సామాజికవర్గానికి చెందిన నేతకు అవకాశం కల్పించింది. ఈసారి మాత్రం ప్రధాన పార్టీలన్నీ ఆదివాసీ నేతల పైనే భారీ ఆశలు పెట్టుకుంటున్నాయి. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని సిర్పూర్, ఆసిఫాబాద్, ఆదిలాబాద్, బోథ్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో ఆదివాసీల ప్రభావం ఎక్కువగా ఉండగా.. నిర్మల్, ముథోల్ నియోజక వర్గాల్లో మాత్రం లంబాడాల ఆధికృత కనిపిస్తోంది. దీంతో లోక్‌సభ ఎన్నికల్లో సరైన అభ్యర్థులను బరిలో దింపేందుకు అన్ని పార్టీలు ముమ్మర కసరత్తు చేస్తున్నాయి. రెండు, మూడు రోజుల్లోనే ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉండడంతో ప్రధాన పార్టీలన్నీ అభ్యర్థుల ఎంపికపై సీరియస్‌గా దృష్టిని సారించాయి. దాదాపుగా అభ్యర్థుల ఎంపిక కొలిక్కి వచ్చినా అధికారిక ప్రకటనే ఆలస్యంగా కనిపిస్తోంది. ప్రధాన పార్టీలలో ఆశావహ నేతల చేరికలు కూడా ఊపందుకుంటున్నాయి. ఇదేక్రమంలోనే మాజీ ఎంపీ నగేష్ కారు దిగి బీజేపీలో చేరడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆయన బీజేపీలో చేరడంతో రాజకీయ సమీకరణలు మరింతగా మారనున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే గోడం నగేష్ చేరికపై ఆ పార్టీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆయన అభ్యర్థిత్వంపై పలు నియోజకవర్గాల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

ఆదివాసీ అయితే ఓకే..

ఎంపీ అభ్యర్థుల ఎంపికలో ప్రధాన పార్టీలు ముఖ్యంగా నేతల సామాజికవర్గాలను పరిగణలోకి తీసుకుంటున్నాయి. ఎందుకంటే గత కొన్నేళ్లుగా ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో ఆదివాసీ, లంబాడా తెగల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతోంది. దీంతో తెగల వారీగా విడిపోయిన గిరిజనులు తమ సామాజికవర్గానికి చెందిన నేతలకు మద్దతుగా నిలుస్తూ వస్తున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఇదే కనిపించింది. ప్రధానంగా ఖానాపూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో అభ్యర్థులు గెలవడానికి ఆదివాసీలే ప్రధాన కారణమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లోను ఇదే కొనసాగుతుందని ప్రధాన పార్టీలు అంచనా వేస్తున్నాయి. దీంతో పార్టీలన్ని ఆదివాసీ నేతల పైనే ప్రత్యేక దృష్టిని సారిస్తున్నాయి. తాజాగా మాజీ ఎంపీ గోడం నగేష్‌ను బీజేపీ పార్టీలో చేర్చుకోవడంపై ఆదివాసీలకు మరింత ప్రాధాన్యత ఏర్పడుతోంది. అయితే సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావు ఆదివాసీ సామాజికవర్గమే అయినప్పటికీ.. అదే సామాజికవర్గానికి చెందిన మాజీ ఎంపీని కొత్తగా పార్టీలో చేర్చుకోవడంపై మతలాబ్ ఏమిటన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కును అభ్యర్థిగా ఖరారు చేస్తూ బీఆర్ఎస్ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది. అయితే సామాజిక సమీకరణల్లో భాగంగా మార్పులు చేర్పులు చేసే అవకాశం కూడా లేకపోలేదు. కుదిరితే సక్కు లేకపోతే జాన్సన్‌నాయక్ అన్న ఉద్దేశంతో బీఆర్ఎస్ అధిష్ఠానం కనిపిస్తోంది. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆ పార్టీ టికెట్ కోసం కూడా తీవ్రమైన పోటీ కనిపిస్తోంది. అయితే కాంగ్రెస్‌లో ప్రస్తుతం సీనియర్ నేతలు ఎవరూ లేకపోవడంతో దీటైన ఆదివాసీ నేత కోసమే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తుంది.

కనిపించని భరోసా

అన్ని పార్టీలలో లంబాడా సామాజికవర్గానికి చెందిన నేతలు ఉన్నా.. వారికి అధిష్ఠానం భరోసా ఇచ్చినట్లు కనిపించడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పార్లమెంట్ పరిధిలో మంచి అనుభవం, ఆర్థిక పలుకుబడి ఉన్న వారికి అవకాశాలు దక్కడం కష్టమేనన్న వాదనలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా బీజేపీలో మాజీ ఎంపీ రాథోడ్ రమేష్, భైంసా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజేష్‌బాబు, సీనియర్ నాయకులు హరినాయక్, ప్రస్తుత ఆదిలాబాద్ జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, మరికొంత మంది ఆశావహ నేతలు టికెట్‌ను ఆశిస్తున్నా.. కొత్తగా ఆదివాసీ సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎంపీ గోడం నగేష్‌ను బీజేపీ చేర్చుకోవడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. అలాగే కాంగ్రెస్ పార్టీలో మాజీ ఎమ్మెల్యే దంపతులు రేఖా, శ్యాంనాయక్‌తో పాటు రాంకిషన్ నాయక్, మరికొంత మంది సీనియర్ నేతలు ఉన్నా.. ఆదివాసీ నేత వైపే ఆ పార్టీ మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తుంది. అధికారానికి దూరమైన బీఆర్ఎస్ టికెట్ కోసం పెద్దగా పోటీ లేకపోయిన ఇద్దరు నేత ల పైనే ఆ పార్టీ ఆశలు పెట్టుకుంది. ఆత్రం సక్కు, జాన్సన్ నాయక్‌లలో ఎవరినో ఒకరిని బరిలోకి దింపాలని భావిస్తోంది. సామాజిక సమీకరణల్లో భాగంగా బీఆర్ఎస్‌లోనూ లంబాడా సామాజిక వర్గానికి కచ్చితమైన హామీ ఏమీ కనిపించడం లేదంటున్నారు. ఇలా అన్ని పార్టీలలో లంబాడా సామాజికవర్గానికి ఆశించిన ప్రాధాన్యత కనిపించడం లేదంటున్నారు.

దీటైన అభ్యర్థి కోసం..

కాంగ్రెస్ పార్టీలో దీటైన వారు లేకపోవడంతో అభ్యర్థి ఎంపికపై ఆ పార్టీ ఆచితూచి అడుగులు వేస్తోంది. ఎవరూ ఊహించని విధంగా అసెంబ్లి ఎన్నికల్లో విజయం సాధించిన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును తెరపైకి తెస్తోంది. ఎందుకంటే వెడ్మ బొజ్జు ఆదివాసీ సామాజిక వర్గం కావడంతో పార్టీ ఆయన వైపే మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తుంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో పార్టీలో చేరిన ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్‌కు హామీ ఇచ్చిన సామాజిక సమీకరణలో భాగంగా ఆమె అభ్యర్థిత్వంపై అధిష్ఠానం ఆలోచనలో పడినట్లు తెలుస్తుంది. రేఖానాయక్ లేదా శ్యాంనాయక్ ఇద్దరిలో ఎవరికో ఒకరికి కాంగ్రెస్ టికెట్ ఇస్తుందని అందరూ భావించినప్పటికీ.. చివరకు ఏదో తేడాగా ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు దీటుగా అభ్యర్థిని బరిలోకి దింపాలని ఆ పార్టీ అధిష్ఠానం సీరియస్‌గా దృష్టి సారిస్తోంది. సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావుకు బీజేపీ టికెట్ దక్కకపోతే ఆయన కాంగ్రెస్‌లో చేరతారన్న ప్రచారం జోరుగా సాగుతున్నా.. దానిపై ఇంకా స్పష్టత కనిపించడం లేదు. ఒకవేళ సోయం కాదంటే పార్టీ పరిస్థితి ఏమిటన్న ఆలోచనతో కాంగ్రెస్ ఉన్నట్లు తెలిసింది. ప్రత్యామ్నాయంగానే వెడ్మ బొజ్జును తెరపైకి తీసుకొస్తున్నారన్న చర్చ జరుగుతోంది. మొత్తానికి ఆదివాసీ నేత వైపే కాంగ్రెస్ పార్టీ కూడా మొగ్గుచూపుతున్నట్లు కనిపిస్తోంది. కొత్త నేతలను బరిలోకి దింపితే పెద్దగా ఫలితం ఉండదన్న అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి.



గిరిజనులతో మాట్లాడుతున్న ఐటీడీఏ ఇన్‌చార్జీ పీవో

గిరిజన సమస్యలపై తక్షణమే స్పందించాలి

- ఐటీడీఏ ఇన్‌చార్జీ పీవో ఖుష్బుగుప్త
- గిరిజన దర్బార్‌కు తరలివచ్చిన ఆదివాసీ, గిరిజనులు

ఉట్నూర్, మార్చి11: ఉమ్మడి జిల్లాలోని గిరిజనులు తమ సమస్యల పరిష్కారం కోసం ఉట్నూర్ ఐటీడీఏకు వస్తున్నారని, గిరిజనుల సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్త అన్నారు. గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల అర్జీలను స్వీకరించారు. దీనిలో భాగంగా పలువురు పింఛన్‌లు, రెండు పడక గదుల ఇళ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తులన అందజేశారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని పీవో సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జనరల్ కనక భీంరావు, డీడీ దిలీప్‌కుమార్, ఈఈ రాథోడ్ భీంరావు, అదనపు వైద్యాధికారి కుమ్ర బాలు, ఆర్‌సీవో గంగాధర్, ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

• గిరిజన విద్యార్థులు బడి మానవేయకుండా చూడాలి

ఉట్నూర్: ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీ గిరిజన విద్యార్థులు చదువులు మధ్యలో మానేయకుండా చూడాల్సిన బాధ్యత ఆదివాసీ సంఘాల ప్రతినిధులపై ఉందని ఐటీడీఏ ఇన్‌చార్జీ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్త అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని కేబీ కాంప్లెక్స్‌లో గల సమావేశ మందిరంలో జిల్లాలోని గోండ్వాన పంచాయతీ రాయిసెంటర్ సర్‌మెడీలు, ఆదివాసీ సంఘాల నాయకులతో ఆమె ఉట్నూర్ ఆదివాసీ సంఘ నాయకులతో కలిసి పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖుష్బుగుప్త మాట్లాడుతూ ఆదివాసీల తెగల్లో ముఖ్యంగా డ్రాప్‌ఔట్ పిల్లల సమస్య చాలా ఉందని, సెలవుల తర్వాత పిల్లలు ఇంటికి వెళ్లిన తర్వాత పాఠశాలలకు రాకుండా ఉంటారని, వారిని వెంటనే స్కూళ్లకు పంపే విధంగా ఆదివాసీ పెద్దలు చూడాలన్నారు. ఇంకా చాలానే ఆదివాసీ గ్రామాల్లో పోడు భూములకు పట్టాలు రాని రైతులు ఉన్నారని, వారిని గుర్తించి సర్వే చేసి వెంటనే పట్టాలు ఇవ్వడానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కాగా, ఎండకాలంలో ఆదివాసీ గ్రామా ల్లో నీటి సమస్య చాలా ఉందని ఆదివాసీ నాయకులు పీవో దృష్టికి తేగా.. నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు. ఇందులో తుడందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేష్, తుడందెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్క బాపురావ, రాజ్‌గోండ్ సేవ సమితి రాష్ట్ర ప్రచార కార్యదర్శి మంగం విషంరావ్, ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.



సర్వేలో పాల్గొన్న డీఎంహెచ్‌వో, సిబ్బంది

కుష్ఠు వ్యాధి రహిత జిల్లాగా కృషి చేయాలి

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 11: కుష్ఠు వ్యాధి రహిత జిల్లాగా ఆదిలాబాద్‌ను తీర్చిదిద్దడానికి ప్రతీఒక్కరు కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ అన్నారు. సోమవారం కుష్ఠు వ్యాధి గుర్తింపు సర్వేను పట్టణంలోని చిల్కూరి లక్ష్మీనగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీలో ఇంటింటా తిరుగుతూ వివరాలను సేకరించారు. వ్యాధి లక్షణాల గురించి అడిగి తెలుసుకుంటూ వివరాలను నమోదు చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ సమాజంలో కుష్ఠు వ్యాధిని శాపంలా భావిస్తున్నారన్నారు. మూఢ నమ్మకాల కారణంగా వ్యాధిగ్రస్థులను బహిష్కరిస్తున్నారని తెలిపారు. ముందుగానే వ్యాధిని గుర్తిస్తే అంగవైకల్యం రాకుండా నయం చేయవచ్చని తెలిపారు. ఎలాంటి స్పర్శలేని మచ్చలుంటే ఇంటికి వచ్చే వైద్య సిబ్బందికి తెలపాలన్నారు. జిల్లాలో సోమవారం నుంచి 24వరకు 14 రోజుల పాటు గుర్తింపు సర్వే ఉంటుందని, ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎయిడ్స్ అండ్ లెప్రసీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ గజానంద్, యూపీహెచ్‌సీ వైద్యురాలు దీపిక, డీఎంవో వామన్‌రావ్, ఎల్‌టీ రమణచారి, సీవో విష్ణు, ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను సక్రమంగా నిర్వహించాలి

బోథ్, మార్చి 11: అంగన్‌వాడీ కేంద్రాలను టీచర్లు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు సక్రమంగా నిర్వహించాలని సీడీపీవో సౌందర్య కోరారు. సోమవారం బోథ్ ఐసీడీఎస్ పరిధిలోని 92 మంది అంగన్‌వాడీ టీచర్లకు సెల్‌ఫోన్లను అందించడం జరిగిందతి. గతంలో చెడిపోయిన సెల్‌ఫోన్‌ల స్థానంలో కొత్త సెల్‌ఫోన్‌లను ఇస్తున్నామన్నారు. 2019లో 287 సెంటర్లకు సెల్‌ఫోన్లు ఇవ్వడం జరిగిందని, ప్రస్తుతం సెల్‌ఫోన్లు చెడిపోయిన వారికి 16జీబీ సెల్‌ఫోన్‌లను ఇస్తున్నామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో పూర్వ ప్రాథమిక విద్యను తప్పనిసరిగా బోధించాలన్నారు. ఈనెల 9 నుంచి 23 వరకు పోషకాహార పక్షోత్సవాలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఆరు నెలలు దాటిన పిల్లలకు భోజనంపై అవగాహన తల్లులకు ఇస్తున్నామన్నారు. తల్లిపాలతో పాటు పోషకాహారం ఏ విధంగా అందించాలని ఈ కార్యక్రమాల్లో వివరించడం జరుగుతుందని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం : లంక

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 11: పట్టణంలోని భగత్‌సింగ్ నగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లంక రాఘవులు ఆరోపించారు. సోమవారం సంఘం ఆధ్వర్యంలో కాలనీవాసులు కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కాలనీలో మౌళిక వసతులు కల్పించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ భగత్‌సింగ్‌నగర్ కాలనీలో మౌలిక వసతులు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇందులో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్, జిల్లా అధ్యక్షుడు స్వామి, నాయకులు ఆశన్న, పెద్దసంఖ్యలో కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

- జిల్లా కలెక్టర్ రాజార్షిషా
- అధికారులతో సమ్మర్‌యాక్షన్ ప్లాన్‌పై సమావేశం
- 'ప్రజా ఫిర్యాదుల విభాగం'లో అర్జీలను స్వీకరించిన కలెక్టర్



ఆదిలాబాద్ అర్బన్, మార్చి 11: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని ఏర్పాటు చేయాలని ఎంపీడీవో, ఎంపీవో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను జిల్లా కలెక్టర్ రాజార్షిషా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో సమ్మర్ యాక్షన్ ప్లాన్, తాగునీటి సరఫరాపై అధికారులతో సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండకాలంలో ఎక్కడ తాగునీటి సమస్య రాకుండా ఏర్పాటు చేసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. హ్యాండ్ పంపు, పంపుసెట్ రిపేర్లు చరేసి వాటి వాడుకలోకి తీసుకు రావాలని, మిషన్ భగీరథ లీకేజిలను మరమ్మత్తు చేయాలని సూచించారు. అవసరమైన చోట కొత్త పైపులు, హౌజ్‌హోల్డ్ కనెక్షన్‌లు అందించి నీరు సరఫరా పూర్తిగా జరిగేటట్లు చూడాలని సూచించారు. భగీరథ నీరు వెళ్లని చోట ప్రత్యామ్నయ మార్గాలను ఏర్పాటు చేయాలన్నారు. మరమ్మత్తు పనులకు గ్రామ పంచాయతీ నిధులను ఉపయోగించాలని,ఎక్కడెక్కడ రిపేర్ అవసరమో ఆ పనులన్ని ఈ నెల 31లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. కాగా, అంతకుముందు.. ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల విభాగంలో భాగంగా పలువురు అర్జిదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి ఆయా సమస్యలపై దాదాపు 50 మంది వరకు తరలివచ్చినట్లు అధకారులు పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీఆర్డీవో సాయన్న, సీఈవో, డీపీవో శ్రీలత, మిషన్ భగీరథ ఎస్.ఈ సురేష్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, ఏఈఎస్ ఆర్‌డబ్ల్యుఎస్, ఎంపీడీవోలు, ఎంపీవోలు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు (ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న కలెక్టర్)

కజ్జర్ల, దేవాపూర్‌లలో అక్రమ వెంచర్ల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తలమడుగు, మార్చి 11: మండలంలోని దేవాపూర్, కజ్జర్ల గ్రామాలలో అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన వెంచర్లను సోమవారం స్థానిక అధికారులు తొలగించారు. ఈ నెల 10న 'ఆంధ్రజ్యోతి' జిల్లా దినపత్రికలో 'రెచ్చిపోతున్న రియల్ మాఫియా' అనే శీర్షికన కథనం ప్రచురణ కావడంతో స్పందించిన పంచాయతీరాజ్ శాఖ అధికారులు, మండలంలోని కజ్జర్ల, దేవాపూర్ గ్రామాలలో ప్రభుత్వ అనుమతి లేకుండా పచ్చని పంట పొలాల్లో బండరాళ్ల పాతి ప్లాట్లుగా ఏర్పాటు విక్రయించుకోవడంతో అధికారులు స్పందించి పంచాయతీ సెక్రెటరీలు శోభారాణి, అర్చనలు అక్రమ వెంచర్లలో బండరాళ్లను తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా ఎవరైనా ప్లాట్లు ఏర్పాటు చేస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.



ఆంధ్రజ్యోతి
ఆదిలాబాద్ జిల్లా వార్తలు
రెచ్చిపోతున్న.. రియల్ మాఫియా

'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం



బండరాళ్లను తొలగిస్తున్న పంచాయతీరాజ్ శాఖ అధికారులు

సంక్షిప్త సమాచారం

నేడు మండల సమావేశం

ఉట్నూర్, మార్చి 11: ఉట్నూర్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభంకానున్న సమావేశానికి మండల పరిషత్ సభ్యులు, మండలంలోని అన్ని శాఖల అధికారులు, గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారుతు తమ నివేదికలతో హాజరు కావాలని కోరారు.

'విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు'

తాంసి, మార్చి 11: మండలంలోని ఆయా ప్రాంతాల్లో విదులు నిర్వహిస్తున్న ఉద్యోగులు విధుల విషయంలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎంపీడీవో గడ్డం మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు, వివిధ శాఖల అధికారులు, కారోబార్లతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీఅధికారి ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రజాపాలన ఫిర్యాదులను పరిష్కరించాలని ఆదేశించారు. ఇందులో సూపరింటెండెంట్ రవీందర్, అధికారులు, తదితరులున్నారు.

'సమస్యలను పరిష్కరించాలి'

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 10: గ్రామ పంచాయతీ కార్మికులు, ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జఆశన్న డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి నినాదాలు చేశారు. అనంతరం ప్రజాఫిర్యాదుల విభాగంలో కలెక్టర్ రాజర్షిషాకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులు, ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఇందులో మున్సిపల్ యూనియన్ కార్యదర్శి అగ్గిమల్ల స్వామి, తదితరులున్నారు.

'21న చలో హైదరాబాద్'

ఉట్నూర్, మార్చి 11: తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారం కోసం ఈనెల 21న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఆత్రం సోనేరావులు కోరారు. సోమవారం వారు ఈమేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందించారు.

పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి

- ముస్లిం మతపెద్దలతో సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్యామలదేవి

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 12: శాంతియుత వాతావరణంలో రంజాన్ పండుగను జరుపుకోవాలని అదనపు కలెక్టర్ శ్యామలదేవి అన్నారు. సోమవారం జడ్పీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన రంజాన్ పండుగ సందర్భంగా రేపటి నుంచి ప్రారంభంకానున్న రంజాన్ ఉపవాస దీక్షలను పురస్కరించుకుని అదనపు కలెక్టర్ శ్యామలదేవి, మున్సిపల్ ఛైర్మన్ జోగుప్రేమేందర్, ఏఎస్‌డీఎస్పీ జీవన్‌రెడ్డి ఆర్డీవో జీవికరరెడ్డి, మైనార్టీ అధికారి రాథోడ్‌రమేష్‌లతో కలిసి ముస్లిం మత పెద్దలు, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 12 నుంచి ప్రారంభంకానున్న రంజాన్ ఉపవాస దీక్షలను శాంతియుతంగా పండుగ వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. రంజాన్ మాసంలో ఉపవాస దీక్ష సమయంలో మసీదుల వద్ద పరిశుభ్రంగా ఉండేలా శానిటేషన్ పనులు చేయాలని, తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని మిషన్ భగీరథ అధికారులను, వీధి దీపాలు వెలిగేలా చూడాలని మున్సిపల్ అధికారులను, ట్రాఫిక్ శాంతి భద్రతలకు ఆటంకం కలుగకుండా చూడాలని పోలీసు అధికారులను, అగ్ని ప్రమాదాలు జరుగకుండా తగిన చర్యలు చేపట్టాలని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారులను, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని ట్రాన్స్‌కో అధికారులకు అదనపు కలెక్టర్ సూచించారు. నైట్ మార్కెట్లో పళ్లు కూరగాయలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉపవాస దీక్షలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని, ఏమైనా ఇబ్బందులు ఉంటే పోలీసు శాఖ దృష్టికి తీసుకు వెళ్లాలని ఈ సందర్భంగా పోలీసు శాఖ తరపున పూర్తి సహాయ సహకారాలను అందిస్తామని ఏఎస్ డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ముస్లిం మతపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

మంగళవారం	బుధవారం
ఇఫ్తార్	సహర్
సా.6.31	ఉ.5.04



జ్ఞానాన్ని బోధించండి.. సౌలభ్యాలను సృష్టించండి.. కోపావేశం పెచ్చరిల్లినప్పుడు మౌనం వహించడం ఉత్తమ వ్యక్తి లక్షణం.